సాక్షి రంగారెడ్డి

సోమవారం । 27 । మే । 2024



లాభాలు బారెడు

పలు నర్సరీల్లో తక్కువ ఖర్చుతో రైతులకు సకాలంలో ఆరోగ్యకరమైన మొక్కలను పెంచి అందిస్తున్నారు. 8లో▸



మీ ముందుంటా

ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. 8లో▸



వీధికుక్కల దాడి

మేకల మందపై వీధికుక్కలు దాడి చేయడంతో 14 మేకలు మృతి చెందాయి. ఈ సంఘటన అమ్దాపూర్‌లో చోటుచేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

వినియోగదారుల భద్రత ప్రధానం



సూపర్‌మార్కెట్‌లో సాధారణ తనిఖీ


తుర్కయంజాల్: సూపర్‌మార్కెట్‌లు, మాల్స్‌లో వినియోగదారుల భద్రతే ప్రధానంగా ఏర్పాట్లు చేయాలని రాచకొండ బాంబ్ స్క్వాడ్ తెలిపింది. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆదివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని బీమార్ట్‌లో ఇబ్రహీంపట్నం డివిజన్ రాచకొండ బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా సూపర్‌మార్కెట్‌ను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

త్వరలో వృత్తి నైపుణ్య విశ్వవిద్యాలయం

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వృత్తి నైపుణ్య విశ్వ విద్యాలయాన్ని (స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్శిటీ) మంజూరు చేసిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పనులు ముందుకు సాగలేదు. జూన్ 4న ఫలితాల అనంతరం పనుల్లో పురో గతి కనిపించే అవకాశం ఉంది. నాలుగు నెలల క్రితం రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి కొడంగల్, బొంరాస్‌పేట మండలాల్లో అవసరమైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. కొడంగల్ మున్సిపల్ పరిధి బూల్కాపూర్ శివారు, బొంరాస్‌పేట మండల పరిధిలో సర్కారు స్థలాలను పరిశీలించారు. ఎక్కడ ప్రభుత్వ స్థలం అనుకూలంగా ఉంటే.. అక్కడ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

పాఠశాల ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టెంపరరీ రికగ్నైజేషన్ (ఈటీఆర్) పొడిగింపులో వసూళ్ల పర్వం కొనసాగుతోంది. అడిగినంత ఇస్తేనే స్కూళ్లకు గుర్తింపు రెన్యూవల్స్ చేస్తున్నారు. లేదంటే పార్కింగ్, ఆటస్థలాలు, ఫైర్‌సేఫ్టీ వంటి అంశాలను సాకుగా చూపించి రోజుల తరబడి ఫైళ్లను తొక్కిపెడుతుండటం జిల్లా విద్యాశాఖలో పరిపాటిగా మారింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అధికారులను ఏసీబీ పట్టుకుంటున్నా.. జిల్లా విద్యాశాఖలో మాత్రం మార్పు రావడం లేదు.

తిరకాసు!



విద్యాశాఖలో వసూళ్ల పర్వం

- ఈటీఆర్ పొడిగింపులో కొర్రీలు
- అడిగినంత చెల్లిస్తేనే అనుమతులు
- ఒక్కో పాఠశాలకు ఒక్కో రేటు
- ఇవ్వలేదంటే పెండింగ్‌లో ఫైళ్లు
- చేసేదిలేక 'ముట్టజెబుతున్న' ప్రైవేటు యాజమాన్యాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మరో పదిహేను రోజుల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతోంది. అకడమిక్ ఇయర్ ప్రారంభమయ్యే నాటికి స్కూలుకు గుర్తింపు పొందితేనే అడ్మిషన్లు పెరుగుతాయనే భావనతో మెజార్టీ ప్రైవేటు స్కూలు యాజమాన్యా లు ఇప్పటికే ఈటీఆర్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నాయి. దరఖాస్తు చేసి రోజులు గడుస్తున్నా.. ఇప్పటికీ వాటి రెన్యూవల్స్ పొడిగించకపోవడంతో ఆయా స్కూళ్లకు చెందిన యజమానులంతా జిల్లా విద్యాశాఖ అధికారి, రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల్లో ఉన్న వీక్‌నెస్‌ను విద్యాశాఖలోని పలువురు అధికారులు 'క్యాష్' చేసుకుంటున్నారు. ఇక కొత్తగా గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న స్కూళ్ల నుంచి వివిధ అంశాలను సాకుగా చూపించి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రైమరీ స్కూలుకు రూ.3 లక్షలు.. హైస్కూలుకు రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సాకులు చూపి.. అందినకాడికి..

గ్రేటర్‌లో 4,875 ప్రైవేటు స్టేట్ సిలబస్ స్కూళ్లు ఉండగా, 361 సీబీఎస్‌ఈ సిలబస్, 35 సీఎస్‌ఈ సిలబస్‌వి ఉన్నాయి. మరో 220 ప్లేస్కూళ్లు ఉన్నట్లు అంచనా. వీటిలో ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే 1,800పైగా ఉన్నట్లు సమాచారం. వీటిలో మెజార్టీ పాఠశాలలు 1 నుంచి 5 వరకు గుర్తింపు తీసుకుని, ఏడో తరగతి వరకు క్లాసులు నిర్వహిస్తున్నాయి. మరికొన్ని యాజమాన్యాలు ఏడో తరగతి వరకు అనుమతి తీసుకుని పదో తరగతి వరకు పాఠాలు బోధిస్తున్నాయి. మెజార్టీ ప్రైవేటు స్కూళ్లు అపార్ట్‌మెంట్లు (రెసిడెన్షియల్) భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 90 శాతం పాఠశాలలకు ఆటస్థలాలు, పార్కింగ్ సదుపాయం లేదు. ఫైర్‌సేఫ్టీ కూడా ఉండదు. విద్యాశాఖ అధికారులు దీన్ని అవకాశంగా తీసుకుని, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా సరూర్‌నగర్, బాలాపూర్, హస్తినాపురం, బీఎన్‌రెడ్డినగర్, హయత్‌నగర్, వనస్థలిపురం, రాజేంద్రనగర్, మణికొండ, మాదాపూర్, శేరిలింగంపల్లి తదితర ప్రాంతాల్లోని మెజార్టీ స్కూళ్లకు కనీసం పార్కింగ్ సౌకర్యం లేదు. హస్తినాపురంలోని పలు పాఠశాలలైతే ఏకంగా రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో కొనసాగుతున్నాయి. కనీస రక్షణ లేని ఈ స్కూళ్లకు ఎలా అనుమతి ఇచ్చారనేది అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది. ఏదైనా విద్యార్థి సంఘం గుర్తించి, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే.. తాత్కాలికంగా వారికి షోకాజు నోటీసులు జారీ చేసి వదిలేస్తున్నారు. ఆ తర్వాత వారి నుంచి అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

ఏసీబీకి పట్టుబడినా..

నిజానికి ఒకటి నుంచి ఐదో తరగతి వరకు గుర్తింపు పొడిగింపు కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. 6 నుంచి 10వ తరగతి వరకు రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫీసులో అర్జీ పెట్టుకోవాలి. తర్వాత సంబంధిత అధికారులు అన్ని సర్టిఫికెట్లు పరిశీలించి ఈటీఆర్ జారీ చేస్తుంటారు. అయితే కొంతమంది అధికారులు అడిగినంత ఇస్తేనే ఈటీఆర్ జారీ చేస్తామని హుకుం జారీ చేస్తున్నారు. లేదంటే వివిధ రకాల కొర్రీలు పెట్టి గుర్తింపు జారీలో ఆలస్యం చేస్తున్నారు. చేసేదేమీ లేక యాజమాన్యాలు ఇందుకు తలొగ్గుతున్నాయి. ప్రైవేటు స్కూలు యాజమాన్యం నుంచి లంచం తీసుకుంటూ గత ఏడాది మార్చి 24న సరిహద్దులోని సంగారెడ్డిజిల్లా డీఈఓ సహా మరో సీనియర్ అసిస్టెంట్ ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. అదే ఏడాది హైదరాబాద్ ఆర్‌జేడీ ఆఫీసులోని కొంతమంది అధికారులు రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్‌లోని ఓ సీబీఎస్‌ఈ పాఠశాల అప్‌గ్రేడ్ కోసం రూ.80 వేలు డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడినా అధికారుల వైఖరిలో మాత్రం మార్పు కన్పించడం లేదు.



కన్హా శాంతి వనంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తదితరులు

కన్హా శాంతివనం అద్భుతం

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్

నందిగామ: ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం కలిగి ఉన్న కన్హా శాంతి వనం ఆకు పచ్చని, ఆహ్లాదకరమైన వాతావరణంలో అత్యద్భుతంగా ఉందని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని శ్రీరామచంద్ర మిషన్, కన్హా శాంతి వనాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్ గురూజీ, ధ్యాన గురువు కమ్లేష్ పటేల్ (దాజీ)తో కలిసి ధ్యానం చేశారు. అనంతరం మోహన్ యాదవ్ మాట్లాడుతూ.. పచ్చని చెట్లు, పలు రకాలైన ఔషధ మొక్కలు, పండ్లు, పూలు, హార్టీకల్చర్, టిష్యూ కల్చర్ ల్యాబ్‌లు ప్రకృతిని కాపాడేందుకు కావాల్సిన అన్ని వసతులు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. భారత దేశం అంతటా అంతరించిపోతున్న వృక్షజాతులను సంరక్షిస్తూ, ప్రచారం చేస్తున్న ప్రపంచ స్థాయి టిష్యూ కల్చర్, నర్సరీలు బాగున్నాయని కితాబిచ్చారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం, హార్ట్‌ఫుల్‌నెస్ సంయుక్తంగా ధ్యానాన్ని ప్రపంచానికి పరిచయం చేయడానికి ముందుకు వచ్చాయని అన్నారు. నిరంతరం ధ్యానం చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ జీవితాలను చక్కదిద్దుకుంటారని వివరించారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే హరితహారం కార్యక్రమాలకు ఎంతగానో మద్దతు ఇచ్చిందని, మొక్కలు, చెట్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని జార్వా, రత్లామ్‌లలోని భూముల్లో ఇప్పటికే అడవుల పెంపకం ప్రారంభించినట్టు చెప్పారు. శివఘడ్ వద్ద 2వేల ఎకరాల్లో చెరువులను సృష్టించామని, సిటీ ఫారెస్ట్ ప్రాజెక్ట్‌లో 50 వేల మొక్కలకంటే ఎక్కువ నాటుతున్నట్లు వెల్లడించారు. దాజీ మార్గదర్శకత్వంలో బహుళ స్థాయి విధానాన్ని అనుసరించామని అన్నారు. గత ఫిబ్రవరిలో దాజీ మధ్యప్రదేశ్‌ను సందర్శించిన సమయంలో లక్ష మొక్కలు నాటామని వివరించారు. కార్యక్రమంలో శ్రీరామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్ (దాజీ) హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు ఆమనగల్లుకు చిన్నజీయర్‌స్వామి రాక

ఆమనగల్లు: పట్టణంలోని బీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో ఈనెల 27న శృతిలయ కల్చరల్ అకాడమీ, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి సంగీత నృత్య శిక్షణ శిబిరాల ముగింపు నిర్వహిస్తున్నట్లు శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు చిత్తరంజన్‌దాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరు కావాలని ఆయన కోరారు.

లైసెన్స్.. సైలెన్స్!

- జూన్ ఒకటి నుంచి కేంద్రం కొత్త చట్టం
- గ్రేటర్‌లో అమలుపై సందిగ్ధం
- రెండెకరాల్లో ట్రాక్‌లు, మౌలిక వసతులు అవసరం
- ఇక్కడ భూమి బంగారం కన్నా ప్రియం
- ఇప్పటి వరకు అలాంటి స్కూళ్లు లేవంటున్న ఆర్టీఏ

అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్లలోనే లైసెన్సులు

సాక్షి, సిటీబ్యూరో: రహదారి భద్రతా చట్టంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్లకు శ్రీకారం చుట్టింది. ఈ స్కూళ్లలో శిక్షణ తీసుకున్నవారికి నేరుగా డ్రైవింగ్ లైసెన్సులు లభిస్తాయి. మరోవిధంగా చెప్పాలంటే డ్రైవింగ్ లైసెన్సుల జారీ ప్రక్రియలో ప్రైవేట్ సంస్థలకు భాగస్వామ్యాన్ని కల్పిస్తూ కేంద్రం మోటారు వాహన చట్టంలో మార్పులు తెచ్చింది. జూన్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఇంతవరకు బాగా ఉందికానీ.. గ్రేటర్‌లో ఇప్పటి వరకు అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్ల ఏర్పాటు కాలేదు. దీంతో లైసెన్సుల జారీలో కొత్త నిబంధనల అమలుపై సందిగ్ధం నెలకొంది. 'కేంద్రం రూపొందించిన ఈ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిందే. అక్రిడేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు' అని రవాణా శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. నిబంధనల మేరకు స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు సంస్థలు లేదా వ్యక్తులు ముందుకు వస్తే అనుమతివ్వనున్నట్లు పేర్కొన్నారు.

సమర్థంగా.. ప్రామాణికంగా..


అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్లు ఇచ్చే నాణ్యమైన, సమర్థమైన శిక్షణే ప్రామాణికంగా భావించి లైసెన్సులు ఇవ్వాలనేది చట్టం ప్రధాన ఉద్దేశం. ఈ డ్రైవింగ్ స్కూళ్లు ఇచ్చే '5- ఏ' సర్టిఫికెట్ల ఆధారంగా నేరుగా లైసెన్సులు పొందవచ్చు. డ్రైవింగ్ లైసెన్సుల జారీలో రవాణా అధికారాలను పూర్తిగా పరిమితం చేస్తూ ప్రవేశపెట్టిన అక్రిడేటెడ్ స్కూళ్ల ఏర్పాటు ఎంతో ఖరీదైన వ్యవహారం కావడంతో వ్యాపార సంస్థలు లేదా డ్రైవింగ్‌లో శిక్షణనిచ్చేందుకు ఆసక్తి ఉన్నవారు సైతం ముందుకు రావడం లేదు. ఇప్పటికే ఈ రంగంలో ఉన్న సాధారణ డ్రైవింగ్ స్కూళ్లు కూడా నిరాసక్తత చూపుతున్నాయి. రెండు ఎకరాల్లో ట్రాక్‌లను ఏర్పాటు చేయడంతో పాటు వాహనాలు, మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంటుంది. కానీ.. పెద్దమొత్తంలో పెట్టుబడి పెడితే ఆదాయం ఆ స్థాయిలో ఉండకపోవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ ఆర్టీసీ హకీంపేట్‌లో ఈ తరహా డ్రైవింగ్ స్కూల్‌ను నిర్వహిస్తోంది. ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణలో మెలకువలు నేర్పించేందుకు దీన్ని ఏర్పాటు చేశారు.

ఈ సదుపాయాలు తప్పనిసరి..

అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్ల కోసం కనీసం 2 ఎకరాల్లో వివిధ రకాల టెస్ట్‌ట్రాక్‌లను ఏర్పాటు చేయాలి. ప్రాథమిక శిక్షణ కోసం సిమ్యులేటర్లను ఏర్పాటు అవసరం. శిక్షణ తరగతుల కోసం పక్కా భవనాలను నిర్మించాలి. తరగతి గదులు ఉండాలి. ఇంటర్నెట్ సదుపాయం, ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ, టీచింగ్ పరికరాలు తదితర మౌలిక సదుపాయాలు.

స్థల లభ్యతే ప్రధాన సమస్య

నగరంలో భూమి లభ్యతే ప్రధాన సమస్యగా మారింది. అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్లకు ఎకరం నుంచి రెండెకరాల స్థలం అవసరం. కార్లు వంటి తేలికపాటి వాహనాలు నడిపేందుకు ఎకరం పరిధిలో డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్, బస్సులు, లారీలు వంటివి నేర్చుకొనేందుకు 2 ఎకరాలలో ట్రాక్‌లు ఉండాలి. నగరానికి నలువైపులా ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో రియల్ ఎస్టేట్ బూమ్‌తో భూమి ధరలకు రెక్కలొచ్చాయి. రూ.కోట్లు వెచ్చించి భూమిని కొనుగోలు చేసి డ్రైవింగ్ స్కూళ్లు ఏర్పాటు చేయడం అసాధ్యమనే భావన ఉంది. ఇలా ఏర్పాటు చేసే అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్లలో ఫీజులు కూడా భారీ మొత్తంలోనే ఉంటాయి. అలాంటప్పుడు శిక్షణ తీసుకొనేందుకు అభ్యర్థులు ముందుకు రాకపోవచ్చు. ఏ విధంగా చూసినా ఇది ఖరీదైన వ్యవహారంగా మారడంతో అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్ల ఏర్పాటు సవాల్‌గా మారింది. ఈ క్రమంలో కేంద్రం కొత్త చట్టం అమలుపై సందిగ్ధత నెలకొంది.



వాన.. హైరానా



ఇబ్రహీంపట్నం: ఆటోపై కూలిన చెట్టు, విరిగిపడిన విద్యుత్ స్తంభం

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలోని పలుప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. చెట్లు నేలకొరిగాయి. తీగలు తెగిపడ్డాయి. కరెంటు సరఫరా నిలిచిపోయింది. గుడిసెలు కూలిపోయాయి.. ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. రోడ్లకు అడ్డంగా చెట్లు పడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అందరిచూపు.. పల్లెపోరు వైపు

- 'స్థానిక' ఎన్నికలపై దృష్టి
- పోటీకి ఆశావహుల ప్రయత్నాలు
- పెరిగిన పలకరింపులు, మర్యాదలు
- గ్రామాల్లో మొదలైన కోలాహలం



షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్ల తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఎన్నికల తంతు ప్రశాంతంగా పూర్తికావడంతో యంత్రాంగమంతా ఊపిరిపీల్చుకుంది. ఇదే సమయంలో నాయకులు, అధికారులు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారిస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని, అందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది.

ఆశలపల్లకిలో..

ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో గ్రామ, మండల స్థాయిలో కష్టపడిన ఆయా పార్టీల నాయకులు ఇప్పుడు తమ లక్ష్యం స్థానిక సంస్థల్లో పోటీ చేయడమే అంటున్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో సర్పంచ్‌కు పోటీచేసే విషయంలో ఈసారి గట్టి పోటీ కనిపిస్తోంది. మూడు ప్రధాన పార్టీల మద్దతు, స్వతంత్రంగా బరిలో నిలవాలనుకునే వారు ఆశల లోకంలో విహరిస్తున్నారు. గతంలో పోటీచేసి ఓడిపోయిన వారితోపాటు కొత్త వాళ్లు ఈ పదవిపై కన్నేస్తున్నారు. ఇందుకోసం ఏపార్టీ మద్దతు ఉంటే తమకు లాభం ఉంటుందనే విషయమై ఇప్పటికే అంచనాకు వచ్చి మొన్నటి ఎన్నికల్లో కొందరు పార్టీలు మారారు. ఎంపీ ఎన్నికల ఫలితాల తరువాత పార్టీల మార్పు కొనసాగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు పార్టీల బీ-ఫారాలు అవసరం ఉండటంతో కొందరు నాయకులు ఇప్పటి నుంచే తమ పార్టీ ముఖ్యులను కలుస్తూ శాసనసభ, లోకసభ ఎన్నికల్లో తాము కష్టపడిన తీరును వివరిస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపైకి అందరి దృష్టి మళ్లడంతో.. ప్రభుత్వం ఎప్పుడు పచ్చజెండా ఊపుతుందా.. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు ప్రకటిస్తుందా అని ఎదురుచూస్తున్నారు. పంచాయతీ అధికారులు గతంలో చేపట్టిన ప్రక్రియకు అదనంగా అవసరమైన సమాచారాన్ని సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. పోలింగ్ కేంద్రాల విషయంలో కొంత స్పష్టత రావాల్సి ఉంది.

వ్యక్తిగత ప్రచారాలు

గ్రామాల్లో ఇప్పటికే ఆశావహులు ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి పలకరింపులు, మర్యాదలు, వరుసలు కలుపుతున్నారు. పెళ్లి ఇతర వేడుకలు హాజరవుతున్నారు. వాట్సాప్ స్టేటస్‌లలో ప్రతీ ఒక్కరి పెళ్లి, బర్త్‌డే తెలుసుకొని మరీ విషెస్ చెబుతున్నారు. గతంలో పలకరించని వారు కూడా వ్యక్తిగతంగా ప్రచారాలు చేసుకుంటూ సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీగా అవకాశం ఇవ్వాలని వేడుకుంటున్నారు. పల్లెల్లో పోరుకు నోటిఫికేషన్ వెలువడక ముందే ప్రచారాలతో హీటెక్కిస్తున్నారు.

కోడ్ ముగిసిన తర్వాత..

వచ్చే నెల 4న వెలువడే లోక్‌సభ ఎన్నికల ఫలితాల తరువాత ఎన్నికల కోడ్ ముగియనుంది. ఇప్పటికే ప్రభుత్వం కూడా లోక్‌సభ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని ప్రకటన చేసింది. ఇదే జరిగితే వచ్చే మూడు నెలలపాటు ఊరూరా కోలాహలమే కనిపించనుంది. ఇప్పటికే గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. మొదట సర్పంచ్ ఎన్నికలు జరగాల్సి వస్తే జిల్లాలోని 585 గ్రామ పంచాయతీల్లో నిర్వహించాలి. తరువాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇప్పుడున్న రిజర్వేషన్‌లు ఇస్తారా..లేదా మారుతాయా అనేది కూడా చర్చ జరుగుతోంది.

కుకింగ్ ఆయిల్.. డేంజర్ బెల్!

- మెరిసేదంతా మంచి నూనె కాదు
- ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో నాణ్యతకు తిలోదకాలు
- ఆరోగ్య సమస్యలు తప్పవంటున్న నిపుణులు
- గానుగ నూనెకు పెరుగుతున్న డిమాండ్
- రైస్ బ్రాన్ ఆయిల్‌పైనా మక్కువ

సాక్షి, సిటీబ్యూరో: ఆహార ప్రియులకు వంట నూనె డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఈమధ్య హోటళ్లలో తనిఖీలు చేసినపుడు పేరున్న సంస్థలు సైతం నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని తేలిపోయింది. ఇక రోడ్డు పక్కన బండిపై బజ్జీలు, సమోసాలు, ఇతర ఫాస్ట్‌ఫుడ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సి అవసరం లేదు. నూనె రంగు మారినా అందులోనే వంటకాలను తయారు చేసి వినియోగదారులకు ఇస్తున్నారు. ఇదంతా ఆరోగ్యానికి హానికరమని తెలిసినా.. తాము తినేది మంచి ఆహారమే అనుకుంటూ లాగించేస్తున్నారు. ఆరోగ్యం చెడి వైద్యుల దగ్గరకు వెళ్లాక అసలు విషయం తెలిసి నష్ట నివారణ చర్యలకు ఉపక్రమిస్తున్నారు. వంటల్లో విరివిగా వినియోగించే నూనెల విషయంలో అచితూచి వ్యవహరించాలని జాతీయ పౌష్టికాహార సంస్థ (ఎన్‌ఐఎన్) సూచిస్తోంది. నూనెల శుద్ధిలో ఆయా తయారీ సంస్థలు అనుసరిస్తున్న విధానంతో సంప్రదాయంగా ఉండే పోషక విలువలు తగ్గుముఖం పడుతున్నాయని, కేవలం సారం లేని నూనెలు మాత్రమే బహిరంగ మార్కెట్‌లోకి వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే గానుగ నూనెలకు గిరాకీ పెరుగుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నూనెల ప్రాసెసింగ్ ప్రక్రియలో విటమిన్, ఏ, డీ,ఈలను జత చేస్తున్నారు. ఫలితంగా నూనె ఆకర్షణీయ రంగు వస్తోంది. అయితే.. ఈ రంగే మనల్ని మోసం చేస్తుందనేది అందరికీ తెలియదు. రసాయనాలు, ఇతరత్రా కలపడంతో రంగు మారుతోంది. దీంతో క్యాన్సర్, ఇతర రోగాలు వచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పట్టణాల్లో అపార్ట్‌మెంట్ కల్చర్ పెరిగి ఇంట్లోనే ఉంటున్నారు. దీంతో విటమన్ డీ, కాల్షియం లోపం కనిపిస్తోంది. పీసీఓడీ సమస్య ఉన్నవారికి, బాలింతలకు నువ్వుల నూనె వాడాలంటూ నిపుణులు ప్రతిపాదిస్తున్నారు.

సన్‌ఫ్లవర్ రిఫైన్డ్ నూనెలో పోషక విలువలు ఇలా (100 గ్రాములకు)..

శక్తి	825 కేలరీల నుంచి 900 కేలరీలు
ఫ్యాట్	100 గ్రాములు
విటమిన్ ఎ	750 మైక్రో గ్రాములు
విటమిన్ డి	11.25 మైక్రో గ్రాములు
విటమిన్ ఈ	30 నుంచి 40 మిల్లీ గ్రాములు



ఆ నూనెతో ప్రమాదం



రిఫైన్డ్ ఆయిల్ ప్రాసెసింగ్‌లో కెమికల్స్ కలపాల్సి వస్తోంది. దీంతో పోషక విలువలు పోతున్నాయి. వీటన్నిటి కంటే గానుగ నూనెలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయి. కొన్నిసార్లు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నూనె నల్లగా రంగు మారినా అందులోనే బజ్జీలు వేయడం వంటివి చూస్తుంటాం. దీని వల్ల ఫ్రీరాడికల్స్ అభివృద్ధి చెద్ది మన శరీరంలోని సెల్స్‌ను నాశనం చేస్తాయి.

– రేఖ, న్యూట్రిషన్ నిపుణులు

పెరిగిన రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగం



గడిచిన రెండేళ్లుగా రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. గుండె సంబంధిత వ్యాధులకు రైస్ బ్రాండ్ నూనె మంచిది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నూనె రంగు మారినంత వరకు మరుగుతూ ఉంటుంది. అటువంటి వాటి వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.

– చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సేల్స్, మార్కెటింగ్

గానుగ నూనె వాడుతున్నాం..



మార్కెట్‌లో లభించే వివిధ కంపెనీలకు చెందిన సన్ ఫ్లవర్, వేరుసెనగ నూనె వినియోగించే వాళ్లం. రెండేళ్ల నుంచి గానుగ పట్టించిన నూనె కొనుగోలు చేస్తున్నాం. నూనె ధరలో మాత్రం భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. మార్కెట్‌లో లీటరు 110 రూపాయలకే లభిస్తుండగా, గానుగ నూనె మాత్రం లీటరు సుమారు రూ.300కు పైగా చెల్లించాల్సి వస్తోంది.

– వరలక్ష్మి, గృహిణి, హస్తినాపురం

నెక్లెస్ రోడ్డులో జంతు ప్రేమికుల ప్రదర్శన

ఖైరతాబాద్: పెంపుడు జంతువులతో ప్రేమగా మెలగాలని కోరుతూ ఆదివారం నెక్లెస్ రోడ్డులో డాగ్ పార్క్ వద్ద జంతు ప్రేమికులు ప్ల కార్డులు ప్రదర్శించారు. ఇటీవల రహమత్‌నగర్‌లో జరిగిన సంఘటన తమను క్షోభకు గురిచేసిందని, ప్రజల్లో జంతువుల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు జంతువుల, మానవ సంబంధాలు మరింత బలపడాలని కోరారు. ఈ సందర్భంగా డాగ్స్‌తో పాటు జంతుప్రేమికులు నిరసన వ్యక్తం చేశారు.

చిన్న సమస్య ఉన్నా మీ ముందుంటా

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



మాట్లాడుతున్న సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: ప్రజల సహకారంతో మహేశ్వరం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ పోచమ్మబాగ్ (నార్త్) కాలనీవాసులు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆదివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనమీద నమ్మకంతో మహేశ్వరం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం అందుబాటులో ఉంటానని చెప్పారు. కాలనీల్లో చిన్న సమస్య ఉన్నా మీ ముందుంటానని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేసేందుకు పాటుపడతానని అన్నారు. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షుడు ఆకుల అరవింద్ కుమార్, నాయకులు ఇంటూరి అంకిరెడ్డి, సుశీలారెడ్డి, కేశవరెడ్డి, ఇస్మాయిల్, గౌని శ్రీనివాస్, రాజేష్‌గౌడ్, రిషీ, గోవర్ధన్ రెడ్డి, ప్రత్యూష్, పి.రాజు, జహీర్, సాధిక్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకున్నోడే వేధించాడు!

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య



కల్పన మృతదేహం

మొయినాబాద్: ఏడు నెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నవాడే అదనపు కట్నం కోసం వేధించడంతో ఇంట్లోనే ఉరివేసుకుని గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్‌కు చెందిన నర్లకంటి మల్లేశ్ కూతురు కల్పన(22) బాసర ట్రిపుల్‌ఐటీ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది. నగరంలోని ఆసిఫ్‌నగర్‌కు చెందిన వారి బంధువు బైరంపల్లి శ్రీశైలం కొంత కాలంగా కల్పనను ప్రేమించాడు. గత ఏడాది అక్టోబర్ 29న ఇద్దరూ ఆర్యసమాజ్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇరు కుటుంబాల ఒప్పందంతో ఈ ఏడాది ఫిబ్రవరి 11న హిందూ సాంప్రదాయం ప్రకారం ఇద్దరికీ పెళ్లి చేశారు. అప్పటి నుంచి శ్రీశైలం కుటుంబం మొయినాబాద్ మండలంలోని హిమాయత్‌నగర్‌లో నివాసం ఉంటోంది. కాగా కల్పన ఇతరులతో ఫోన్‌లో మాట్లాడుతుందని అనుమానించిన శ్రీశైలం మానసికంగా, శారీరకంగా వేధించడంతోపాటు అదనపు కట్నంగా స్విఫ్ట్ కారు ఇప్పించాలని డిమాండ్ చేశాడు. అతనికి తల్లి స్వరూప, బాబాయి రాజు సైతం సహకరించి కల్పనను వేధించారు. వారి వేధింపులు భరించలేక శనివారం రాత్రి ఆమె ఇంట్లోనే చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖర్చు మూరెడు.. లాభాలు బారెడు

- నర్సరీల ఏర్పాటుతో పలువురికి ఉపాధి
- ఎక్కువ విస్తీర్ణంలో సాగుకు అవకాశం
- కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్న రైతులు



నాగర్‌గూడలోని నర్సరీలో కూరగాయల నారు

షాబాద్: ఎండాకాలంలో నాణ్యమైన, ఆరోగ్యకరమైన నారును పెంచాలంటే చాలా కష్టం. నారు పెంచే సమయంలో ఎక్కువగా వర్షం కురిసినా, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా మొలకెత్తిన నారు పాడవుతుంది. పోసిన నారులో సగానికి సగం నాశనమవుతుంది. దీంతో అనుకున్న స్థాయిలో పంటను నాటలేక రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం అలాంటి నష్టాలు వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పలు నర్సరీల్లో తక్కువ ఖర్చుతో రైతులకు సకాలంలో ఆరోగ్యకరమైన మొక్కలను పెంచి ఇస్తున్నారు.

ఆరోగ్యకర మొక్కలు

షాబాద్ మండల పరిధిలోని నాగరగూడలో 10 ప్రైవేట్ నర్సరీ కేంద్రాలు నెలకొన్నాయి. ఈ సంస్థలు నర్సరీల్లో రైతుకు ఆరోగ్యకరమైన మొక్కలను పెంచి అందిస్తోంది. నాగరగూడ చుట్టుపక్క గ్రామాల రైతులు తాము సాగుచేసే కూరగాయల నారును నర్సరీ నుంచే తీసుకుంటున్నారు. సాగు కోసం పంట విత్తనాలు ఇచ్చిన, లేక రైతు చెప్పిన రకాన్ని నర్సరీ నిర్వాహకులు పెంచి ఇస్తున్నారు. ఈ క్రమంలో తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన నారు సకాలంలో అందించొచ్చు. రైతులు స్వతహాగా నారుమడులు ఏర్పాటు చేసుకోవడాన్ని తగ్గించారు. సంవత్సరం పొడవునా టమాటా, వంకాయ, మిర్చి, క్యాలీఫ్లవర్, క్యాబేజీ, బంతి, చామంతి తదితర పూల నారులతో నర్సరీ కళకళలాడుతోంది.

తెగుళ్ల రావు

విత్తనాన్ని శుద్ధిచేసి వైరస్‌లు సోకకుండా ప్రత్యేకంగా తయారు చేసిన షెడ్డులో నారు పెంచుతారు. ఎప్పటికప్పుడూ పరిశీలిస్తూ కావాల్సిన పోషకాలు అందించడంతో తక్కువ సమయంలో నారు ఏత దశకు వస్తుంది. పంట పొలంలో మొక్క నాటిన అనంతరం కూడా ఆరోగ్యంగా పెరిగి తొందరగా పంట చేతికి రావడంతో పాటు, అధిక దిగుబడులు వస్తాయి.

విత్తనం వృథా కాదు

ఒక్కొక్క విత్తనం ట్రేలో జాగ్రత్తగా నాటడంలో ప్రతీ విత్తనం మొలకెత్తి ఆరోగ్యంగా పెరుగుతుంది. సాధారణ స్థాయిలో రైతులు ఏర్పాటు చేసే నారుమడుల్లో ఎకరా టమాటా సాగుకు 80గ్రాముల నుంచి 100గ్రాముల వరకు అవసరం. అదే నర్సరీలో ఎకరాకు 30గ్రాముల టమాటా విత్తనం సరిపోతుంది.

సమయానికి నారు సిద్ధం

రైతులు విత్తనం ఇచ్చిన సమయం నుంచి టమాటా 20 నుంచి 25 రోజులు, వంకాయ 40 నుంచి 45రోజులు, మిర్చి 35 నుంచి 40 రోజులు, క్యాలీఫ్లవర్, క్యాబేజీలు 30 నుంచి 35 రోజుల్లో రైతుకు ఏతకు వచ్చిన నారు సిద్ధంగా ఉంటుంది.

సేంద్రియ ఎరువుతో..



సేంద్రియ ఎరువులతో నారును పెంచుతున్నాం. దీంతో నాణ్యమైన నారును ఇవ్వడానికి వీలుంటుంది. రైతులు ఎక్కువగా నారును కొనుగోలు చేస్తున్నారు. టమాటా, వంకాయ, క్యాలీఫ్లవర్ నారు 40 పైసల నుంచి 60 పైసల వరకు విక్రయిస్తున్నాం. మిర్చి 80 నుంచి ఒక రూపాయి వరకు విక్రయిస్తున్నాం. నర్సరీలో అయితే ఎండ పడకుండా షెడ్‌నెట్‌లను ఏర్పాటు చేశాం. కావాల్సిన సమయంలో నీటిని తుంపర పద్ధతిలో అందిస్తున్నాం.

– బీరప్ప, నర్సరీ నిర్వాహకుడు, నాగరగూడ

నారు ఆరోగ్యంగా పెరుగుతుంది



నర్సరీలో నారు ఆరోగ్యంగా పెరుగుతుంది. పంట పొలాల్లో నారు పోస్తే చలి, వానకు సక్రమంగా మొలకెత్తదు. విత్తనాలు మొలకెత్తే సమయంలో అధిక ఉష్ణోగ్రత ఉంటే నారు చనిపోతుంది. సాధారణంగా రైతులు పొలాల్లో నారు పెంచే సమయంలో ఇలాగే నష్టపోతున్నారు. చీడపీడల బెడద కూడా ఎక్కువే. నర్సరీలో అయితే ఎండపడకుండా షెడ్‌నెట్‌లను ఏర్పాటు చేస్తారు. కావాల్సిన సమయంలో నీటిని తుంపర పద్ధతిలో అందిస్తారు. దీంతో నారు ఆరోగ్యంగా ఉంటుంది.

– సామ ప్రతాప్‌రెడ్డి, రైతు, ఎర్రోనిగూడ

ప్రాణం తీసిన ఈత సరదా

క్వారీగుంతలో పడి యువకుడి దుర్మరణం



సయ్యద్ మన్నన్ మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: ఈత సరదా ప్రాణం తీసింది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని మంగళ్‌పల్లికి చెందిన సయ్యద్ మన్నన్ (33) స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం కలెక్టరేట్ వెనకాల ఉన్న బోరబండ క్వారీలో ఈతకు వెళ్లారు. అందరూ నీళ్లలోంచి బయటకు రాగా మన్నన్ రాకపోవడంతో వెంటనే పరిశీలించారు. క్వారీలో శ్వాస ఆడక మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మేకల మందపై వీధికుక్కల దాడి

14 మేకలు మృతి



వీధికుక్కల దాడిలో మృతి చెందిన మేకలు

మొయినాబాద్: మేకల మందపై వీధికుక్కలు దాడి చేయడంతో 14 మేకలు మృతి చెందాయి. ఈ సంఘటన మండల పరిధిలోని అమ్డాపూర్‌లో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్డాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరికుంట్ల దేవేందర్, లలిత దంపతులు మేకలు పెంచుతూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే శనివారం రాత్రి మేకలను ఇంటి పక్కనే మందలో ఉంచారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామంలోని వీధికుక్కలు మేకల మందపై దాడి చేశాయి. దీంతో 14 మేకలు మృతి చెందాయి. మృతి చెందిన మేకల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని.. తమ జీవనాధారమైన మేకలు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయామని బాధితులు బోరున విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

19వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య

మణికొండ: డిప్రెషన్, మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి 19వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేటలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుజరాత్ రాష్ట్రం, బావనగర్‌కు చెందిన అశిష్ దీపక్ లక్వాని(28) కుటుంబ సభ్యులతో కలిసి కోకాపేటలో ఉంటున్న సోదరి ఇంటికి వచ్చాడు. మానసిక సమస్యలతో బాధపడుతున్న అతను చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం మైహోం త్రక్షియలోని 19వ అంతస్తు బాల్కనీ నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి తండ్రి దీపక్ చంద్రసేన్ లక్వానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

జూ కిట కిట

30 వేలకు పైగా సందర్శన..



చార్మినార్: నెహ్రూ జులాజికల్ పార్కు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. ఆదివారం కావడంతో 30,361 మంది జూ పార్కును సందర్శించినట్లు జూ అధికారులు తెలిపారు. టికెట్ కౌంటర్‌లతో పాటు జూ పార్కులోని అన్ని ఎన్‌క్లోజర్స్‌ల సందర్శకులు సరదాగా గడిపారు. పాఠశాలలకు సెలవులు దగ్గర పడడడంతో అధిక సంఖ్యలో ప్రజలు జూ పార్కును సందర్శించారు. సందర్శకులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అదనపు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు జూ క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హీరేమత్ తెలిపారు.

ఎయిర్‌పోర్టు కాలనీ అసోసియేషన్ కార్యవర్గం

శంషాబాద్: పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా వై.సురేష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా బూడిద రమేష్‌ముదిరాజ్, రాచమల్ల గణేష్‌లను ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శి బొల్లు సంజయ్(బంటి), సంయుక్త కార్యదర్శులుగా హనుమంతురావు, శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్‌యాదవ్, కోశాధికారులుగా శ్రీకాంత్‌గౌడ్, సిద్దులు ముదిరాజ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గసభ్యులను కాలనీ అసోసియేషన్ నాయకులు తదితరులు ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు కష్టం విలువ తెలియాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ భీమపాక నగేష్

కవాడిగూడ: విద్యార్థులకు కష్టం విలువ తెలిసినప్పుడే పోరాట పటిమ అలవడుతుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్ అన్నారు. పిల్లల మనసు కష్టపెట్టకుండా పెద్దలు వారికి సరైన సమయంలో తగిన సూచనలు సలహాలు ఇచ్చి ముందుకు నడిపించాలన్నారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠంలో 15 రోజుల పాటు నిర్వహించిన "సంస్కార్" వేసవి శిక్షణ కార్యక్రమం ముగింపు సభ నిర్వహించారు. కార్యక్రమానికి నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 1200 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ భీమపాక నగేష్ మాట్లాడుతూ కోట్లాది మంది ప్రజలను తమ మాటలతో జాగృతం చేసిన స్వామి వివేకానంద స్ఫూర్తితో చిన్నారులు ఆదర్శవంతులుగా ఎదుగుతారన్నారు. రామకృష్ణమఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద మాట్లాడుతూ.... బహుజన హితాయా... బహుజన సుఖాయా... అన్న సందేశాన్ని ఈ తరానికి నేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎక్కడైతే స్వచ్ఛత, నిస్వార్థ గుణాలు ఉంటాయో అక్కడే ప్రపంచం తలవంచుతుందని తెలిపారు. రామకృష్ణ మఠం నిర్వహించే కార్యక్రమాల్లో భక్తులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

పర్యాటకులను ఆకట్టుకున్న నేచర్‌క్యాంప్

తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే పర్యావరణ పర్యాటక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రెండు రోజుల నేచర్ క్యాంపు ఆదివారం ముగిసింది. వాన్డేరింగ్ బీ హాలిడేస్ ఆర్గనైజేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సందర్శకులు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా ట్రెక్కింగ్ , క్యాంప్ ఫైర్ నిర్వహించి వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బర్డ్‌వాక్‌లో 17 రకాల పక్షులను తిలకించారు. అడ్వెంచర్స్‌లో భాగంగా రివర్‌క్రాసింగ్, వాలీక్రాసింగ్, క్లైంబింగ్ తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సందర్శకుల స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఇకపై నిరంతరం నేచర్ క్యాంపులు, ట్రెక్కింగ్, బర్డ్ వాచింగ్, అడ్వెంచర్ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రకృతి పర్యాటకానికి పెద్ద పీట వేసి (మద్య నిషేధిత) నేచర్ క్యాంపులను ప్రోత్సాహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎకో టూరిజం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎకో టూరిజం ప్రాజెక్ట్స్ మేనేజర్ కె.సుమన్,వాండేరింగ్ బీ రంఘవేంద్ర ప్రసాద్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, బోటనిస్ట్ డాక్టర్. వీరకిషోర్, నేచురలిస్ట్‌లు, శ్రీకాంత్, భాస్కర్, అడ్వెంచర్ ట్రైనర్స్ సంతోష్, నరేష్, బాబు, వెంకటేష్, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

చైతన్యపురి: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ గణేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీ రోడ్ నంబర్-11లో శ్రీకాంత్ భార్య సరిత ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. గత కొంత కాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్న సరిత చికిత్స పొందుతోంది. బుధవారం సాయంత్రం శ్రీకాంత్ పాలప్యాకెట్ తెచ్చేందుకు బయటికి వెళ్లి వచ్చే సరికి సరిత (43) పాటు ఇద్దరు కుమారులు మృదుల్ (12), తరుణ్ (9) కనిపించలేదు. దీంతో అతను భార్యకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. వారి కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో శ్రీకాంత్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలోనూ సరిత ఇదే తరహాలో పిల్లలను తీసుకుని చెప్పకుండా స్నేహితురాలి ఇంటికి వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత విద్వేషాలు పనిచేయవు: చల్లా

అత్తాపూర్: ఎన్నికల్లో మత ఉద్వేగాలు పనిచేయమని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి అన్నారు. తెలంగాణలో మతం కార్డు అసలే పనిచేయదని చేవెళ్ల లోక్ సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి మంచి అధిక్యంతో గెలవబోతున్నారని తమ అంతర్గత అధ్యయనంలో తేలిపోయిందని తెలిపారు. ఆదివారం ఆయన జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళారం గోవర్ధన్‌రెడ్డితో కలిసి అత్తాపూర్‌లో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ 12 లోక్‌సభ స్థానాలను గెలుచుకోబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదింపినట్లుగానే ఈ మారు దేశ ప్రజలు బీజేపీ సర్కారును గద్దె దింపబోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.రవీందర్‌గౌడ్, అనిల్‌రెడ్డి, కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరు చంపారు..? ఎందుకు చంపారు..?

- బిల్డర్ కుప్పల మధు హత్య కేసులో ముమ్మర దర్యాప్తు
- రంగంలోకి బీదర్ పోలీసులు
- మధు మరో ముగ్గురితో కలిసి బీదర్ వెళ్లినట్లు గుర్తింపు
- రూ. 5 లక్షల నగదు, రూ. 20 లక్షల విలువైన ఆభరణాలు మాయం



కుప్పల మధు(ఫైల్)

కుత్బుల్లాపూర్: కాపు సంఘం నేత, బిల్డర్ కుప్పల మధు హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ మేరకు బీదర్ జిల్లాకు చెందిన మానే కేలి పోలీసులు నిందితులను పట్టుకునేందుకు రంగంలోకి దిగారు. మధు ఈ నెల 24న ఉదయం తన కారులో డ్రైవర్ రేణుక అనే వ్యక్తి తో కలిసి బీదర్ వెళ్లాడు. చింతల్ ప్రాంతంలో మరో ఇద్దరు కారులో ఎక్కినట్లు తెలిసింది. నలుగురు కలిసి బీదర్ ప్రాంతంలో ఓ క్లబ్బులో గడిపారు. అదే రోజు రాత్రి మధు భార్య లక్ష్మి అతడికి ఫోన్ చేయగా అప్పటికే బయలుదేరినట్లు చెప్పాడు. మరో గంట తర్వాత ఫోన్ చేయగా అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చార్జింగ్ అయిపోయి ఉంటుందని భావించారు. అయితే శనివారం ఉదయం బీదర్ జిల్లా పరిసర ప్రాంతాల్లో ఓ వ్యక్తిని కత్తులతో పొడిచి బండరాళ్లు వేసి దారుణంగా హత్య చేసినట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలంలో ఉన్న కారు నెంబరు ఆధారంగా కర్ణాటక పోలీసులు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు. శనివారం ఉదయం జీడిమెట్ల పోలీసులు కుత్బుల్లాపూర్ కల్పన సొసైటీలో ఉన్న మధు ఇంటికి వెళ్లి ఆయన భార్య లక్ష్మికి మధుకు కారు యాక్సిడెంట్ అయిందని చెప్పి ఘటనా స్థలానికి తీసుకువెళ్లారు. అక్కడికి వెళ్లి చూడగా మధు హత్యకు గురైనట్లు తెలిసి వారు షాక్ అయ్యారు . అతడి శరీరంపై 30కి పైగా కత్తిపోట్లు ఉన్నాయి. తలపై బండరాయి మోది హత్య చేసినట్లు గుర్తించారు. ఇంటి నుంచి వెళ్లే సమయంలో రూ . 5 లక్షల నగదు, ఒంటిపై రూ. 20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు తీసుకెళ్లినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం ఆదివారం మృతదేహాన్ని తీసుకువచ్చి పద్మా నగర్ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

పథకం ప్రకారమే హత్య చేశారా..!

రియల్ వ్యాపారిగా, కాపు సంఘం నేతగా కుత్బుల్లాపూర్ ప్రాంతంలో సుపరిచయస్తుడిగా ఉన్న మధు కొద్ది కాలంలోనే రూ. కోట్లకు పడగలెత్తాడు. దీంతో ఎక్కడికి వెళ్లినా మంది మార్బలం.. ఒంటినిండా నగలతో కనిపించాడు.. ఇటీవల అతడి పెద్ద కుమార్తెకు వివాహ నిశ్చితార్థం కూడా జరిగింది. ఆగస్టులో పెళ్లి ఉండగా ఇంతలోనే హత్యకు గురి కావడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. హత్య పథకం ప్రకారమే చేశారా..! ఎవరైనా పాత ఆర్థిక లావాదేవీలతో సుపారి ఇచ్చి హత్య చేయించారా..? డబ్బు, ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాల కోసమే డ్రైవర్ ఈ ఘాతుకానికి ఒడిగట్టాడా..! వెంట వెళ్లిన వారి సెల్‌ఫోన్లు ఎందుకు స్విచ్ఛాఫ్ చేశారు ప్రశ్నలు అనుమానాలకు తావిస్తున్నాయి. కర్ణాటక పోలీసులు హత్య కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. స్థానికంగా అందరితో ఆప్యాయంగా మాట్లాడే మధు అత్యంత దారుణంగా హత్యకు గురి కావడం చర్చనీయాంశంగా మారింది. అతడి వద్ద ఎన్నో ఏళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్న రేణుక దొరికితే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు.